ప్రజాశక్తి

శనివారం 19 జూలై 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

రిలీవ్ చేయకుండా అధికారులు, ఎంఎల్ఎ వేధిస్తున్నారని

దళిత ఉద్యోగి అదృశ్యం

● రక్తపు మరకలతో సూసైడ్ లెటర్ ● గాలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరువూరు : తాను బదిలీ అయినా రిలీవ్ చేయకుండా అధికారులు, ఎంఎల్ఎ వేధిస్తున్నారని, దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు జల వనరుల శాఖ ఎఇఇ రక్తపు మరకలతో లేఖ రాసి అదృశ్యమయ్యారు. ఈ సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో గురువారం జరిగింది. "ప్రభుత్వం బదిలీ చేసి నెల రోజులవుతున్నా రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఇఇ, స్పెషల్ డివిజన్, విజయవాడ) పి.గంగయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డిఇఇ, స్పెషల్ సబ్ డివిజన్, కంచికచర్ల) ఎస్.ఉమాశంకర్, తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు కలిసి ఆడుతున్న రాజకీయ నాటకంలో నేను అలసి పోయాను, ఒక దళిత ఉద్యోగిగా నాకు జరిగిన అన్యాయం ఇంకెవరికీ జరగకుండా చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు, ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్‌కు విజ్ఞప్తి చేస్తూ తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రక్తపు మరకలతో లేఖ రాసి ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఇఇ) వేసుపోగు కిషోర్ అదృశ్యమయ్యారు. ఈ సంఘటన తిరువూరు నియోజకవర్గంలో తీవ్ర కలకలం రేపింది.



లేఖలోని సారాంశం ఇలా ఉంది. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన వి.కిషోర్ జల వనరుల శాఖలో తిరువూరు ఎఇఇగా పనిచేస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను ప్రభుత్వం గత నెల 16వ తేదీన నాగార్జున సాగర్ కెనాల్ (ఎన్ఎస్‌సి) ఓ అండ్ ఎం సెక్షన్ గౌరవరం (జగ్గయ్యపేట నియోజకవర్గ)నకు బదిలీ చేసింది. అయినా అప్పటి నుండి రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా జల వనరుల శాఖ ఇఇ గంగయ్య, డిఇఇ ఉమాశంకర్ ఆయనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇద్దరూ కలిసి తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావుతో ఇంజినీర్ ఇన్ చీఫ్ (మిగతా 2లో)

ఉద్యోగ భద్రత ఇవ్వని జాబ్‌మేళా

● అరకొరగానే జీతాలు ● అసంతృప్తిలో నిరుద్యోగులు !!

● ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి డిమాండ్

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో ప్రతి సంవత్సరం గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉంటున్నారు. వీరికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చాలా తక్కువగా ఉండటంతో ఎక్కువమంది నిరుద్యోగులుగా ఉండిపోతున్నారు. మరి కొంతమంది సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేయడానికి ఇష్టపడక స్థానికంగా చిన్న చిన్న ఉపాధి మార్గాలను ఆశ్రయించి జీవన పోరాటం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగాన్ని తగ్గించేందుకు అడుగులు ముందుకు వేస్తున్నట్లు చెబుతోంది. మచిలీపట్నం నియోజకవర్గ ప్రాంతంలో చదువు పూర్తి చేసిన యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మచిలీపట్నంలోని రాజుపేట ఆంధ్ర జాతీయ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న మల్టీ నేషనల్ కంపెనీలు దాదాపు 30 వరకు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నాయి. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత యువతీ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గత కొన్ని రోజులుగా జాబ్ మేళాలో పాల్గొనటానికి కొంతమంది యువతకు శిక్షణ కూడా ఇచ్చారు. జాబ్ మేళా వివరాలు తెలియజేసే కరపత్రాలను సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. దీంతో జాబ్‌మేళాకు అనూహ్య రీతిలో ప్రజల వద్ద నుండి స్పందన లభించింది. అయితే ఉద్యోగాల కల్పన మాత్రం చాలా తక్కువగా ఉండటంతో జాబ్‌మేళాకు హాజరైన అనేక మంది యువతీ యువకులు అసంతప్తి వ్యక్తం చేశారు.



అట్టహాసంగా నిర్వహించిన జాబ్‌మేళా ఉద్యోగాలలో అతి కష్టమైన సేల్స్, మార్కెటింగ్ రంగంలోనే ఎక్కువ అవకాశాలు కల్పించడం నిరుద్యోగ యువతీ యువకులకు కాస్తంత విస్మయానికి గురిచేసింది. అధిక సంఖ్యలో జాబ్ మేళాలో పాల్గొనటానికి వచ్చిన నిరుద్యోగులు ఒక్కసారిగా జాబ్‌మేళాలో ప్రకటించిన ఉద్యోగాల జాబితాను చూసి డీలా పడిపోయారు. జోయాలుక్కాస్ జ్యువెలర్స్, కృష్ణా, గోదావరి కో ఆపరేటివ్ ఎంఎన్‌సి, ముత్తూట్ ఫైనాన్స్, ముత్తూట్ మైక్రోఫైన్, మెడ్ ప్లస్, జాస్పర్, శ్రీరామ్ ఫైనాన్షియన్స్, అపోలో ఫార్మసీస్, వరుణ్ మోటార్స్, టాటా క్యాపిటల్స్, పేటియం, బిగ్ సి మొబైల్స్, రిలయన్స్ డిజిటల్, ఎస్‌బిఐ క్రెడిట్ కార్డ్స్ ఇలా అనేక ఉద్యోగాలు సేల్స్ రంగంలోనే ఉండటంతో కొంతమంది మహిళ నిరుద్యోగులు అసంతప్తి వ్యక్తం చేశారు. మహిళలు సేల్స్ ఉద్యోగాలు చేయటం కష్టతరంగా ఉంటుంది. అందులోనూ కొంతమంది మహిళలు ఉద్యోగం రీత్యా ఇతర రాష్ట్రాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లడం భారంగా భావిస్తారు. భర్త పిల్లలతో ఇతర ప్రాంతాల్లో నివాసం ఏర్పాటు చేసుకుని చాలీచాలని (మిగతా 2లో)

ఏడుగురు వైసిపి నేతల అరెస్ట్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటనలో అల్లర్లు సష్టించే ప్రయత్నం చేశారని వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఏడుగురు వైసిపి నేతలను అరెస్టు చేశారు. పలువురు వైసిపి నేతలపై టిడిపి నాయకులు బొడ్డు శ్రీనివాసరావు గురువారం స్థానిక ఇనగుదురు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారించిన ఇనగుదురు పోలీసులు 19 మంది వైసిపి నేతలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 19 మందిలో ఏడుగురిని అరెస్ట్ చేశారు. అనంతరం వారికి మచిలీపట్నంలోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం వీరిని జడ్జి ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వీరిలో ఎ-1గా మాజీ మంత్రి పేర్ని నాని కుమారుడు పేర్ని కృష్ణమూర్తి ఉన్నారు. వీరితోపాటు మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతితోపాటు మహిళా కార్పొరేటర్లు వాణి కుసుమ, బందెల కవితలపై కూడా కేసు నమోదు చేశారు. అరెస్టయిన వారిలో మేకల సుబ్బన్న, గూడవల్లి నాగరాజు, నోబుల్ థామస్, కొలుసు హరిబాబు, తుమ్మలపల్లి జగన్నాధరావు, బాబావలీ, తిరులమలశెట్టి వర ప్రసాద్ ఉన్నారు.

ఎస్‌బి సిఐ శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కష్ణాజిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ వాసంశెట్టి శ్రీనివాసును సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజి పి.అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించారన్న ఆరోపణల నేపథ్యంలో సీఐను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. హోం మంత్రి అనిత గురువారం మచిలీపట్నం పర్యటించిన సమయంలో భద్రతా వైఫల్యం కారణంగా సీఐని సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఐజిపి కార్యాలయం నుండి జిల్లా ఎస్పీ కార్యాలయానికి సస్పెన్షన్ ఉత్తర్వులు అందాయి. ఈ విషయంలో మరికొంత మంది పోలీస్ ఉన్నతాధికారులపై కూడా వేటు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కోరం లేక జడ్‌పి సమావేశాలు వాయిదా

● అధికారపక్షం వైసిపి డుమ్మా

● జడ్ ఛైర్‌పర్సన్ సహా సభ్యులంతా గైర్హాజరు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : గత కొన్ని నెలలుగా ఉమ్మడి కష్ణా జిల్లా ప్రజా పరిషత్ సమావేశాల జరుగుతున్న తీరుపై జిల్లా ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జడ్‌పి సమావేశాలను ప్రస్తుతం పాలకులు సద్వినియోగం చేసుకోవడంలో పూర్తిగా విఫలమైనట్లు విమర్శిస్తున్నారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్‌లో శుక్రవారం జరగాల్సిన స్థాయీ సంఘ సమావేశాలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఈ సమావేశాలకు అధికారులు తప్ప వైసిపికి చెందిన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, జడ్‌పిటిసిలు హాజరుకాలేదు. దీంతో సమావేశాలు కోరం లేక వాయిదా వేస్తున్నట్లు జిల్లా పరిషత్ సిఈఓ కన్నమ నాయుడు ప్రకటించారు. ప్రస్తుతం ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ పాలకపక్షంగా వైసిపి ఉంది. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. దీంతో రెండు పార్టీల మధ్య ఆధిపత్యపోరు నెలకొంది. ఈ నేపథ్యంలో సమావేశాలు సజావుగా జరగడంలేదు. ప్రతి రెండు నెలలకొకసారి స్థాయీ సంఘాల సమావేశాలు, ప్రతి మూడు నెలలకొకసారి జనరల్ బాడీ సమావేశం జరగాల్సి ఉంది.



సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న ఖర్చీలు, జడ్‌పి సిఇఒ తదితరులు (అంతర్‌చిత్రంలో)

అయితే గత రెండు విడతలుగా జరిగిన సమావేశాలు విడివిడిగా నిర్వహించకుండా రెండూ కలిపి ఒక రోజు నిర్వహించేలా అజెండా రూపొందించారు. ఈ సమావేశాలు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జరుగుతాయి. సమావేశాలకు జిల్లాలోని మంత్రులతోపాటు శాసన సభ్యులు, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఉమ్మడి కృష్ణాజిల్లాల అధికారులు హాజరవుతారు. ప్రాధాన్యత ఉన్న శాఖలపై సమీక్షకు అజెండా సిద్ధం చేస్తారు. అజెండాలోని అంశాలపై పూర్తి స్థాయిలో చర్చ జరగాలంటే ఉదయం నుండి సాయంత్రం వరకు పడుతుంది. అలాంటిది రెండు సమావేశాలు ఒకే రోజు పెట్టడం వల్ల ఏదీ పూర్తి స్థాయిలో జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఒక్క పూటతో సమావేశాలు ముగిస్తూ మమ అనిపిస్తున్నారు. దీంతో అజెండాలో అంశాలపై పూర్తిస్థాయిలో చర్చ జరగడం లేదు. దీనివల్ల తమ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటల సాగు ప్రారంభమైంది. ఖరీఫ్ పంటలకు సక్రమంగా సాగునీరు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అయితే (మిగతా 2లో)

వినియోగదారులతో మాట్లాడుతున్న సిహెచ్ బాబురావు, వై.నరసింహారావు తదితరులు



విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- ఉయ్యూరు : ట్రూ అప్ ఛార్జీల పేరుతో సామాన్యునిపై ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపుతోందని, స్మార్ట్ మీటర్ల బిగింపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, వై.వెంకటేశ్వరరావు అన్నారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు సుందరమ్మపేటలో విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లతో ప్రజలపై పడే భారాల గురించి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వాస్తవాలను ప్రజల ముందుంచారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పేద, మధ్యతరగతి ప్రజలకు పెనుభారంగా మారాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు (మిగతా 2లో)



వికసిత భారత్‌లో విద్యదే ప్రధాన పాత్ర

నీతి ఆయోగ్ సభ్యులు వీరమణి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వికసిత్ భారత్ లక్ష్య సాధనలో విద్య, నిపుణతదే క్రియాశీలక పాత్ర అని నీతి ఆయోగ్ సభ్యులు డాక్టరు అరవింద్ వీరమణి అన్నారు. 2047 నాటికి మన దేశం వికసిత్ భారత్‌గా ఎదగాలని ప్రధాని మోడీ సంకల్పించారని పేర్కొన్నారు. విజయవాడ ఛాంబరు ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వ్యాపారులతో ముఖాముఖి కార్యక్రమంలో వీరమణి పాల్గొన్నారు. లక్ష్యం చేరుకోవాలంటే అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఛాంబర్ సభ్యులు పాల్గొన్నారు.

ఎపిఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (ఎపిఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్)లో ఉద్యోగ విరమణ పొందిన వందలాది ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సంఘం అధ్యక్షులు కె.కామయ్య డిమాండ్ చేశారు. ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ హెడ్ ఆఫీస్ ఎంప్లాయిస్ – పాఠశాల లు/కళాశాలల్లో పని చేస్తున్న ఉద్యోగుల మధ్య రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించే విధానంలో తీవ్ర అసమానతలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. తాడేపల్లిలోని ప్రధాన కార్యాలయ ఉద్యోగులకు ఇఎల్, ఎన్‌క్యాష్‌మెంట్, డిఎ, పిఆర్‌సి బకాయిలు చెల్లించగా, పాఠశాలలు/కళాశాలలలో పని చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రం వీటిని చెల్లించడంలేదని తెలిపారు.

జిజిహెచ్‌లో బైపాస్ సర్జరీలకు చర్యలు : సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో బైపాస్ సర్జరీకి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని, డాక్టర్లు, సిబ్బందిని వెంటనే నియమించాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ విజ్ఞప్తి చేశారు. గుండెజబ్బులకు చేయాల్సిన బైపాస్ ఆపరేషన్లకు తగిన వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఆపరేషన్లు నిలిపివేస్తున్నట్లు రోగులకు జిజిహెచ్ అధికారులు చెప్పి ప్రైవేటు ఆస్పత్రులకు పంపుతున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బైపాస్ ఆపరేషన్ చేయడానికి అవసరైమన వైద్యులు, సిబ్బందిని అత్యవసరంగా నియమించి పేద, మధ్యతరగతి ప్రజల ప్రాణాలు కాపాడాలని డి.వి.కృష్ణ విజ్ఞప్తి చేశారు. డాక్టర్లు, సిబ్బంది కొరత గత కొంత కాలంగా కొనసాగుతోందని తెలిపారు. జిజిహెచ్‌కు విజయవాడ నగరంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన ఆరు జిల్లాల నుండి వేలాది మంది రోగులు ప్రతిరోజూ వస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇక్కడికి వస్తున్నా వైద్యులు, సిబ్బంది అరకొరగా ఉంటున్నారని, దీంతో ఉన్న వైద్యులు, సిబ్బంది వత్తిడికి గురవుతున్నారని తెలిపారు. రోగులు రోజులతరబడి ఆస్పత్రి చుట్టూ తిరగాల్సి వసోందని పేర్కొన్నారు. వైద్యశాఖ మంత్రి కూడా ఆయిన జిల్లా ఇన్చార్జి మంత్రి సిబ్బంది కొరతను పరిష్కరించకపోగా, చోద్యం చూస్తుండటం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని బైపాస్ సర్జరీలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవ్వాలి : కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-విజయవాడ : ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం పట్ల ఒకటి, రెండు రోజుల వ్యవధిలో ప్రభుత్వం నుంచి కొంత స్పష్టత వ్యక్తం అయినా కానీ...పారిశుధ్య కార్మికుల గత సమ్మె కాలపు ఒప్పందం అంశాలను సాధన కోసం భవిష్యత్ కార్యాచరణకు సన్నద్ధమవాల్సిన అవసరం ఉందని ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు అన్నారు. మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె శుక్రవారం నాటికి 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్ అధ్యక్షత వహించారు. కార్మికులనుద్దేశించి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ...ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఎపి మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాద్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు సమ్మెను విరమించేది లేదన్నారు. రానున్న కాలంలో కూడా పొంచి ఉన్న ప్రభుత్వ విధానాల ప్రమాదానికి వ్యతిరేకంగా పారిశుధ్య కార్మికులు, క్లాప్ ఆటోడ్రైవర్లు అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, ట్రెజరర్ స్టీఫెన్‌బాబు, టి.తరుపతమ్మ, వి.సాంబులు, వెంకట్రావు, చిన్న, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

20న ప్రజారోగ్య వేదిక, జెవివి ఆధ్వర్యాన వైద్య శిబిరం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజా ఆరోగ్య వేదిక, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యాన పాయకాపురం ప్రకాష్ నగర్‌లోని లహరి విద్యాలయంలో ఈనెల 20న ఉదయం 6 నుండి 10 గంటల వరకు షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతాలకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, వైద్య శిబిరం కో ఆర్డినేటర్ జి.విజయ్ ప్రకాష్, జెవివి నగర ప్రధాన కార్యదర్శి వెలగా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ, డాక్టర్ చేకూరి మురళి, డాక్టర్ యశోదమ్మ, డాక్టర్ బి. శ్రీ హర్ష, డాక్టర్ బి. దివ్య వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.



క్వాంటం వ్యాలీతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

మెగా జాబ్‌మేళాలో ఎంపి శివనాథ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : క్వాంటమ్ వ్యాలీతో రాష్ట్రంతోపాటు దేశ ముఖచిత్రమే మారబోతోందని, దీంతో యువతకు ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో మెగా జాబ్ మేళా జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..... ఆ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం.రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జాబ్ మేళాను ప్రారంభించారు. జాబ్‌మేళాలో 35కుపైగా సంస్థలు పాల్గొన్నాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హతలతో ఉద్యోగాలు ఇచ్చేందుకు సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సీహెచ్ ఉషారాణి, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా ఉపాధికల్పన అధికారి సీహెచ్ మధుభూషన్‌రావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

దళిత ఉద్యోగి అదృశ్యం

(ఇఎన్‌సి–అడ్మిన్) బి.శ్యామ్ ప్రసాద్‌కు ఫోన్ చేయించి బదిలీని ఆపేలా రాజకీయం చేశారు. ఒక ఉద్యోగి బదిలీ అయిన తర్వాత ఎంఎల్‌ఎ ఫోన్ చేశారని చెప్పి రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా నిలిపివేశారు. చివరకు రిలీవ్ ఆర్డర్ ఇవ్వాలని జగ్గయ్యపేట ఎంఎల్‌ఎ శ్రీరామ్ తాతయ్య, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయాల నుండి సంబంధిత శాఖ మంత్రికి, ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు ఫోన్ చేసి చెప్పినా ఆ అధికారులు రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా తొక్కిపట్టారు. అంతేగాక బదిలీ చేసి 30 రోజులైనా రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా తొక్కిపెట్టిన ఇఇ, డిఇఇలు... ఎఇ కిషోర్ విధులకు వెళ్లకుండా గైర్హాజరవుతున్నట్లు కొత్త నాటకానికి తెరలేపుతున్నారు. "నా ఏడున్నర ఏళ్ల సర్వీస్‌లో ఏచిన్న రిమార్క్యూలేదు, ఇప్పుడు ఇఇ, డిఇఇ, ఎమ్మెల్యే కలిసి ఆడుతున్న రాజకీయ నాటకంలో నేను అలసిపోయాను, ఓ దళిత ఉద్యోగిగా నాకు జరిగిన ఈ అన్యాయం ఇంకెవరికీ జరగకూడదు, అలా జరగకుండా ఫిర్యాదు చేసేందుకైనా ఓ వ్యవస్థ ఉండాలని కోరుకుంటూ తప్పనిసరి పరిస్థితిలో నేను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాను, నా ఆత్మహత్యకు కారణమైన ఇఇ, డిఇఇ, ఎంఎల్‌ఎపై, పరోక్షంగా సహకరించిన సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, మంత్రి పిఎ బి.శ్రీనివాసరావులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అని ఎఇఇ వి.కిషోర్ రక్తపు మరకలతో లేఖ రాసి అన్ని శాఖల ఉద్యోగుల వాట్సప్ గ్రాపుల్లో పోస్ట్‌చేసి అదృశ్యమయ్యారు. ఇదిలా ఉంటే తన అల్లుడికి రిలీవ్ ఇప్పించాలని ఎంఎల్‌ఎను వేడుకునేందుకు ఎఇఇ మామ శుక్రవారం ఉదయం 8 గంటలకు ఎంఎల్‌ఎ కార్యాలయానికి వెళ్లి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఉన్నా ఎంఎల్‌ఎ పట్టించుకోలేదని తెలిసింది. దీంతో ఎఇఇ కిషోర్ తీవ్ర నిరుత్సాహంతో జల వనరుల శాఖ కార్యాలయం నుండి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. మరోవైపు అదృశ్యమైన ఎఇఇ కిషోర్ చివరి ఫోన్‌కాల్ తిరువూరు సరిహద్దు ఖమ్మం జిల్లా వివిఎంబంజరులో ట్రేసైనట్లు సిఐ చెప్పినట్లు జల వనరుల శాఖ కార్యాలయ సిబ్బంది తెలిపారు. అతని ఆచూకీ కోసం వైపు గాలిస్తున్నట్లు చెప్పారు. కిషోర్ అదృశ్యంపై ఆయన మామ జామ ఆనందరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోరం లేక జడ్ సమావేశాలు వాయిదా

ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కాల్వలు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో కాల్వల శివారు ప్రాంతాలకు సాగునీరు అందక వరి నాట్లు ఎండిపోతున్న పరిస్థితి పలు ప్రాంతాల్లో నెలకొంది. అలాగే ప్రభుత్వం మినుమును ప్రకటించిన మద్దతు ధర లభించడంలేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీంతో రైతుల వద్ద ఇంకా మినుములు నిల్వ ఉండిపోయాయి. ఇలా రైతులు ఎదుర్కొంటున్న అనేక ప్రధాన సమస్యలు జిల్లా పరిషత్ సమావేశంలో చర్చకు వచ్చి పరిష్కారం దొరుకుతుందని ఆశించిన వారికి ఆశలకు అడియాసలే మిగిలాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉమ్మడి కష్ణా జిల్లా జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు ఉమ్మడి జిల్లాల పరిధిలోని కష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుండి ప్రభుత్వ శాఖల అధికారులందరూ హాజరయ్యారు. కానీ అధికారపక్షంగా ఉన్న వైసిపి సభ్యులెవరూ హాజరు కాలేదు. జెడ్పీ ఛైర్పర్సన్ ఉప్పాల హారిక అనుమతితోనే స్థాయి సంఘ సమావేశాలు తేదీని ఖరారు చేసి ఏర్పాటు చేసినా సమావేశాలకు ఛైర్ పర్సన్ ఉప్పాల హారికతోసహా వైసిపి జడ్‌పిటిసి సభ్యులెవరూ హాజరు కాకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం 45 మంది జడ్‌పిటిసిలు, ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు ఉండగా, వీరిలో ఇద్దరు టిడిపికి చెందిన వారు కాగా, మిగిలిన వారంతా వైసిపికి చెందిన వారే. మోపిదేవి, పెడనలకు టిడిపి సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తుండగా, పెడన జడ్‌పిటిసి సభ్యులు అర్జా వెంకట నాగేష్ ఒక్కరే 6వ స్థాయి సంఘ సమావేశానికి హాజరయ్యారు.

ఉద్యోగ భద్రత ఇవ్వని జాబ్‌మేళా

జీతంతో బతకడం కష్టంగా మారుతుందని, వివాహం కాని వారు ఒంటరిగా ఇతర ప్రాంతాల్లో ఉండలేని ఉంటుందని నిరుద్యోగ యువత అభిప్రాయపడుతోంది. గత ప్రభుత్వంలో మచిలీపట్నం నోబుల్ కళాశాలలో అనేకమార్లు జాబ్‌మేళాలు నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొన్న కంపెనీల్లో సేల్స్ ఉద్యోగాలు ప్రకటించడంతో ఎక్కువమంది నిరుద్యోగులు ఆ మేళాలో పాల్గొనలేదు. జాబ్‌మేళా నిరుద్యోగుల నుండి పెద్దగా ఆదరణ పొందలేదు.

తాజాగా నిర్వహించిన జాబ్ మేళాలో అత్యధికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించిన కృష్ణా గోదావరి కోఆపరేటివ్ సొసైటీ మల్టీ నేషనల్ (ఎంఎన్‌సి) కంపెనీ కాకపోవడంతోపాటు పలు కంపెనీలు ఇచ్చిన ఉద్యోగాల భద్రతపైనా చాలా సందేహాలను నిరుద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. గతంలో కృష్ణా గోదావరి కో ఆపరేటివ్ సొసైటీ సేల్స్ ఉద్యోగాలు పొందిన అనేకమంది తమ టార్గెట్లను సాధించలేక రాజీనామాలు చేసిన సంఘటనలు కూడా చాలనే ఉన్నాయి. అలాగే సేల్స్ రంగంలో ఉద్యోగాలు కల్పించిన అనేక కంపెనీలు లెక్కకు మించి టార్గెట్లను ఇవ్వడంతో ఆందోళన చెందుతున్నారు. ఇదే తరహాలో మచిలీపట్నంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఉద్యోగం పొందిన నిరుద్యోగులకు కూడా ఎదురవుతుందని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మచిలీపట్నంలో నిర్వహించిన జాబ్‌మేళాలో కూడా సేల్స్ రంగంలోనే చాలావరకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు జాబ్ మేళాలో ప్రకటించిన తక్కువ జీతంతో రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడటం లేదు. జాబ్‌మేళా నిర్వహించిన అధికారులు ఉద్యోగం కల్పిస్తామని వచ్చే కంపెనీలపై దష్టి సారించి ఉద్యోగ భద్రత లేని సేల్స్ రంగం వైపు కాకుండా ఉద్యోగ భద్రత కల్పించే కంపెనీలను తీసుకురావాలని నిరుద్యోగులు కోరుకుంటున్నారు. అంతేగాక జీతాలు కూడా రూ.10 వేల నుండి రూ.15 వేలలోపే ఉండడంతో నిరుద్యోగులు ఆసక్తి చూపడంలేదు. మచిలీపట్నం నియోజవర్గంలో నిరుద్యోగాన్ని తగ్గించే విధంగా మంత్రి కొల్లు రవీంద్ర ఏర్పాటు చేసిన జాబ్‌మేళా అత్యధిక ఆదరణ పొందినప్పటికీ, మచిలీపట్నం ప్రాంతాల్లో కాకుండా తిరుపతి, తెలంగాణ, ఇతర జిల్లాలు, ఇతర ప్రాంతాల్లో అతి తక్కువ వేతనాలకు ఉద్యోగాలు చేయలేని పరిస్థితి ఉందని నిరుద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. అధికారులు స్పందించి భవిష్యత్తులో ఏర్పాటు చేసే జాబ్‌మేళాల్లోనైనా చదవుకు తగ్గ వేతనాలు, ఉద్యోగ భద్రత ఉండే కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అంతేగాక మచిలీపట్నానికి దగ్గరగా ఉండే ప్రాంతాల్లో ఉద్యోగాలు కల్పించే ప్రైవేటు కంపెనీలను తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు ప్రైవేటు రంగంలో జాబ్‌మేళాలు నిర్వహించడం కంటే ప్రభుత్వం వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేస్తే నిరుద్యోగ సమస్య చాలావరకు తగ్గుతుంది. నిరుద్యోగ సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను పూర్తిస్థాయిలో వెంటనే భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

తల్లొగ్గి ప్రజల నడ్డి విరుస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతోందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ఇప్పటికే రూ.15,485 కోట్ల భారం ప్రజలపై పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గృహ వినియోగదారులకు బలవంతంగా స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు ఆదానీ సంస్థతో కలిసి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. గత వైసిపి ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలను కూడా రద్దు చేయకుండా మరింత భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ విద్యుత్ ఛార్జీల పెంపును, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారని, అవసరమైతే మీటర్లను పగలగొట్టాలని కూడా పిలుపునిచ్చారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు ఏడాదిలోనే నాలుగుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని, స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలకు వ్యతిరేకంగా ఆగస్టు 5న పట్టణ, మండల కేంద్రాల్లోని విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదల వెంకటేశ్వరరావు, కె.శివ నాగేంద్రం, పట్టణ కార్యదర్శి బి.రాజేష్, మండల నాయకులు అన్నే సుబ్బారావు, పడాల లక్ష్మణరావు, బి.కీర్తి, ఎన్.గోపాల్, ఎస్‌కె.ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పి4 లక్ష్యసాధనలో ఉద్యోగులు భాగస్వాములు కావాలి



ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి వికసిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పి4 కార్యక్రమం ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా భాగస్వాములు కావాలని నియోజక వర్గ ప్రత్యేక అధికారి పి సాయిబాబు సూచించారు. శుక్రవారం అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని గ్రామపంచా యతీల కార్యదర్శుల కు పీ ఫోర్ కార్యక్రమం పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలను ధనవంతులుగా తీర్చిదిద్దేందుకు పి ఫోర్ కార్యక్రమాన్ని చేపట్టారని సూచించారు. దీని పై అవగాహన కల్పించాలని ముఖ్యంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఎన్నారైలు సమాజంలోని అనేక రంగాలలో అభివద్ధి చెందిన వారిని గుర్తించి పేదలను దత్తత తీసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. తద్వారా ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర లక్ష్యం నెరవేరుతుందని అన్నారు.



చెత్త సేకరణ పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఇమ్రాన్

తడి, పొడి చెత్త సేకరణ పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గ్రామంలో సురక్షిత మంచినీటి సరఫరా ద్వారా ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలని ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ తెలిపారు. మండలంలోని వేమవరం గ్రామంలో జరుగుతున్న మంచినీటి సరఫరా, తడి ,పొడి చెత్త విడివిడిగా సేకరించు ప్రక్రియను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సురక్షిత మంచింటి సరఫరా ఓవర్ ట్యాంక్ వద్ద పరిశీలించి సిబ్బందికి తగు సూచనలను అందించారు. అలాగే ఇంటి వద్ద నుండి తడి చెత్త పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని సూచించారు. గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఏజేఎల్ నరసింహారావు, మన్యం నరసింహారావు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన కాసాని లక్ష్మీకాంతరావు కొంత కాలంగా వెన్నుముక సంబంధించిన వ్యాధితో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకొని మంచానికే పరిమితమయ్యారు. దీంతో ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఆ కుటుంబానికి మైత్రి ఫౌండేషన్ ద్వారా పది వేల రూపాయల నగదును అందించారు. అలాగే మచిలీపట్నం కాలేఖాన్ పేట శివగంగకు చెందిన 14 సంవత్సరాల విజయకుమార్ అనే బాలుడు గొంతు దగ్గర కణితి (పుండు) సంబంధిత వ్యాధితో బాధపడుతూ దాతల సహకారంతో ఆపరేషన్ చేయించుకున్నారు. అతనికి కూడా మైత్రి ఫౌండేషన్ ద్వారా పది వేల రూపాయలు వైద్యఖర్చుల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణు కుమార్ ,గౌరవ అధ్యక్షులు ఏఆర్కే వరప్రసాద్, ఉపాధ్యక్షులు కాసాని ప్రసాద్, ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్, బ్లడ్ కమిటీ చైర్మన్ వక్కంటి రమాదేవి పాల్గొన్నారు.



వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : లేగసీ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్ల వల్ల పర్యావరణానికి మేలు కలగడమే కాక, ఆర్థిక వ్యవస్థ, సామాజిక ప్రయోజనాలు కలుగుతాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్డులోని పురపాలసంఘ డంపింగ్ యార్డ్ ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో రూ.3.09 కోట్లతో ఏర్పాటు చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ గుడివాడ రూపకల్పనకు అనేక విధాలుగా కషి చేస్తున్నామన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. లెగసీ వ్యర్థాల ప్రాసెసింగ్ ద్వారా రీసైకిల్ చేయదగిన పదార్థాలను వేరు చేసి, తిరిగి ఉపయోగించవచ్చన్నారు. తద్వారా సహజ వనరుల వినియోగాన్ని తగ్గించడమే కాక,



వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వాయు, నీటి కాలుష్యాలను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు చేకూరు జగన్మోహ న్రావు పాల్గొన్నారు.

సుపరిపాలన కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచా యతీ పరిధిలోని మండలిపురం కాలనీలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో సుపరిపాలన ముంద`డుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవార్డు సభ్యులు దేగల రాఘవ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి పుల్లగోరు రాజేంద్ర, డి సి వై చైర్మన్ బచ్చు రంగనాథ ప్రసాద్, గుడివాక శివరావు, చందన, నరసింహారావు పాల్గొన్నారు. అలాగే 8వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, కర్ర సుధాకర్, పరుచూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే కాక పెద్ద ఎత్తున అభివద్ధి కార్యక్రమాలు అందిస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం పట్టణంలోని 16,17 వార్డుల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వ రరావుతో కలసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సుపరిపా లనకు తొలి అడుగు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయనీ, ఆరు లక్షల మందికి ఉద్యోగాలొచ్చే అవకాశం ఉందనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్ గోకవరపు సునీల్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** మండలంలోని చౌరగుడిలో సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో సుపరిపాలన అందిస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అన్ని నెరవేరు స్తున్నామన్నారు. సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, ఎండిఒ సీతారామరాజు, తహసీల్దార్ నవీన్, టిడిపి నాయకులు కందిమళ్ల సుబ్రహ్మణ్యం, జక్కా శ్రీనివాస రావు, ఆలీ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వర్ల కుమార్‌రాజా

మహిళకు కృత్రిమ కాలు అమరిక

ప్రజాశక్తి-గన్నవరం : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం యూనిట్ ఆర్థిక సహకారంతో గన్నవరానికి చెందిన కొనకళ్ళ రామతులసికి కృత్రిమ కాలు అందచేసినట్లు హీల్ సంస్థ సి.ఈ.ఓ. కూరపాటి అజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రం లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గన్నవరం మానవతా యూనిట్ అధ్యక్షులు వీసం ప్రసాదరావు చేతుల మీదుగా కత్రిమ కాలును అందచేశారు. ఈ కార్యక్రమంలో మానవతా - గన్నవరం యూనిట్ చైర్మన్ మడుపల్లి బాలకష్ణ మూర్తి, కన్వీనర్ కర్రా వరప్రసాద రావు, కార్యదర్శి వడ్లమన్నాటి వెంకటకష్ణ మోహన్, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు



పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ఆంధ్ర రాష్ట్ర అవతరణకు మూలకారకుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా రాష్ట్ర రాజధాని అమరావతిలో స్మృతివనం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేయడం పట్ల కూటమి పక్షాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ ఆధ్వర్యంలో ఐదు రోడ్ల సెంటర్‌లో శుక్రవారం పొట్టి శ్రీరాములు విగ్రహానికి కూటమి నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పుర ప్రముఖులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, జనసేన పార్టీ మచిలీపట్నం టౌన్ అధ్యక్షులు గడ్డం రాజు, లోగిశెట్టి స్వామి,పల్లపాటి సుబ్రహ్మణ్యం, వార్డు కౌన్సిలర్ సమత కీర్తి, అన్నంఆనంద్,దింటకుర్తి సుధాకర్, ఆర్యవైశ్య ప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. **ప్రజాశక్తి - గుడివాడ :** రాష్ట్ర రాజధాని అమరావతిలో 6.8 ఎకరాల స్థలాన్ని పొట్టి శ్రీరాములు భారీ విగ్రహానికి ఏర్పాటుకు కేటాయించడంపట్ల ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అభినందనలు తెలిపారు. శుక్రవారం స్థానిక వాసవీ చౌక్‌లో ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్ గోకవరపు సునీల్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు జావాది గంగారాజు, పోకూరి మోహనరావు, తిరివీధి సుబ్బారావు, కొత్త మురళీకృష్ణ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వృద్ధురాలి హత్యకేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని మంతెనలో కలకలం సృష్టించిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు చేధించారు. దీనికి సంబంధించిన వివరాలను డిఎస్‌పి కంకిపాడు పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. మంతెన గ్రామానికి చెందిన టైల్స్ వేసే తిరువీదుల భవానీప్రసాద్ బెట్టింగ్ యాప్స్ వల్ల అప్పులపాలైయ్యాడు. భవానీప్రసాద్ మృతురాలి స్వర్గకుమారి ఇంట్లో టైల్స్ పనిచేస్తుండేవారు. అప్పులపాలవ్వడం వల్ల ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని చంపి డబ్బు, బంగారు కాజేయాలని పథకం వేశాడు. అదును చూసి ఓరోజు వృద్ధురాలి ఇంటికి వెళ్ళి మెడకు చార్జింగ్ వైర్‌తో గట్టిగా బిగించాడు. దీంతో నేలకొరిగిన వృద్ధురాలు బతికి ఉందనే అనుమానంతో కూరగాయాల చాకుతో చేతి మనికట్టును కోశాడు. అనంతరం 47 గ్రాములు నానుతాడుతో పాటు, సెల్ ఫోన్ ను తీసుకుని పరారయ్యాడు. సెల్ ఫోన్‌ను ఉప్పులూరులో, సిమ్ కార్డు ను వేరే చోట పడేసి పరారయ్యాడు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ మురళీకష్ణ, ఎస్ఐ డి సందీప్,అదనపు ఎస్ఐ తాతాచార్యులు, ఎస్ఐ సురేష్ (ఉయ్యూరు రూరల్) లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో కేసు ఛేదించారు. నిందితుడు భవానీప్రసాద్ వద్ద నుండి మృతురాలి గొలుసు, ఛార్జింగ్ ఆడప్టర్, ఛార్జింగ్ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ ఆటోనగర్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఓ కార్మికుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గుడివాడ ఆటోనగర్ లోని ఓ ఇంజనీరింగ్ వర్క్స్‌లో వెల్డింగ్ చేస్తుండగా జరిగిన ప్రమాదంలో గొర్రె వెంకటేశ్వరరావు అనే కార్మికుడు మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన గల్లా రాంబాబుకు గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు. అతని పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన గుడివాడ టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బస్సుడ్రైవర్‌కు జైలు

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం అంపాపురం వేడుక హెూటల్ వద్ద మూడు సంవత్సరాల బాలుడు బస్సు కిందపడి మృతి చెందిన కేసులో నేరం రుజువు కావడంతో బస్సు డ్రైవర్ జోసెఫ్ కి 15 రోజులు జైలు శిక్షను నూజివీడు కోర్టు విధించిందని వీరవల్లి ఎస్ఐ శ్రీనివాసు తెలిపారు.

మట్టితవ్వకాలు నిలుపుదల చేయాలని వినతి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని గరికపర్రు గ్రామ చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు నిలుపుదల చేయాలని గ్రామ మాజీ సర్పంచ్ నడకుదురు రాజేంద్ర గ్రామస్తులతో కలిసి శుక్రవారం కార్యదర్శి బి.వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందించారు.గురువారం సాయంత్రం నుంచి పంచాయతీ పరిధిలో ఉన్న కుమ్మరి వాని చెరువులో మట్టిని మిషన్ల ద్వారా ట్రాక్టర్లలో నింపి తరలించుకు పోతున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి తెలిపారు.ఎటువంటి పర్మిషన్ లేకుండా గ్రామ ప్రజల ఆస్తిని తరలించుకుపోతున్నారని, నివాసయోగ్యాల మధ్య ఉన్న చెరువులో తవ్వకాలు జరగటంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారని అన్నారు.అక్రమ తవ్వకాలతో భూగర్భ జలాలు అడగంటే ప్రమాదం ఉందని వెంటనే ఈ తవ్వకాలు నిలుపుదల చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నడకుదురు రాజేంద్ర,కె.రాము, జాన్ పాల్, మైనేని తారాచంద్, వి.రాము, చింతగుంట సుబ్బారావు ఉన్నారు.


స్మార్ట్ మీటర్లను తొలగించాలని అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సత్యబాబు, తదితరులు

స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి

విజయవాడ : స్మార్ట్ మీటర్లు పెడుతుంటే అడ్డుకోవాలని సిపిఎం తూర్పు సిటీ కార్యదర్శి పుప్పాల కృష్ణ పిలుపునిచ్చారు. మొగలరాజపురంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నాలో శుక్రవారం కృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు మురహరి మాట్లాడారు. ఈ కార్యక్రమములో నగర కమిటీ సభ్యులు స్టాలిన్, శాఖా కార్యదర్శులు దావులూరి శ్రీనివాసరావు, దూపం శివకుమార్, ధర్మారావు, బన్నా వెంకటేష్, వావిలపల్లి వెంకట్రావు, జోగుల రాజేశ్వరి, నరసింహారావు, దొంకాడ పద్మ తదితరులు పాల్గొన్న ఈ ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **విజయవాడ సిటీ :** విజయవాడ విద్యాధరపురం రామరాజు నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఏకలవ్య నగర్ నివాసం ఉంటున్న ముఠా కార్మికులు జి.రాజు ఇంటికి ఎవరు ఇంటి వద్ద లేని సమయంలో వచ్చి మీటర్ మార్చారు. ఈ విషయమై స్థానిక ఎలక్ట్రిసిటీ ఎఇ సురేష్‌కు ఆదాని స్మార్ట్ మీటర్‌ని తొలగించాలని కోరుతూ సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఓవర్లోడ్ ఛార్జీల పేరుతో వేస్తున్న భారాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు మాట్లాడుతూ ప్రజల అభ్యంతరాలను ప్రభుత్వం పట్టించుకోకుండా ఆదాని స్మార్ట్ మీటర్లు బిగింపునకు చర్యలు తీసుకోవడం ప్రజా వ్యతిరేక పాలనన్నారు. విద్యుత్ రంగం సంస్కరణలు సామాన్య మధ్యతరగతి ప్రజల్ని రోజురోజుకీ దోపిడీ చేస్తే పద్ధతులను ఐక్య ఉద్యమాల ద్వారా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎండి మస్తాన్, అప్పలరాజు. బాధితులు రాజు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత : ఇఒ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దుర్గాదేవి దర్శనార్థం ఇంద్రకీలాద్రికి వచ్చేసే యాత్రికులకు మరింత మెరుగైన వసతులు కల్పించాలని ఆలయ సిబ్బందికి కార్యనిర్వహణాధికారి వి.కె.శీనా నాయక్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆలయ కార్య నిర్వాహణాధికారి వికె.సీనా నాయక్, దేవస్థాన అధికారులు పాల్గొన్నారు. అర్చక స్వాములతో కలిసి ఆలయ పరిసరాలు, క్యూలైన్లలో కొనసాగిన యాత్రికుల రద్దీ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నేపథ్యంలో యాత్రికులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, సంతృప్తికరంగా ఉండేలా దర్శన సౌలభ్యం కల్పించాలని, త్రాగునీరు, వాష్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, రవాణా సౌకర్యాల నిర్వహణ సక్రమంగా ఉండటంతో పాటు, ప్రసాదాలు తాజాగా రుచిగా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవస్థాన పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత వాతావరణం నెలకొనాలని ఆలయ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఇంద్రకీలాద్రిపై శుక్రవారంతో పాటు ఆషాడ సారె మహోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో యాత్రికుల రద్దీ కొనసాగింది.

నీటి పైపులకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గేటులో తాగునీటి కుళాయిలకు చెందిన పైపులు కొన్ని ప్రాంతాల్లో పగిలిపోవడంతో స్థానిక టిడిపి అధ్యక్షులు కోట్ల రాజు, ఉపాధ్యక్షులు అమర్లపూడి ప్రేమానందంతో కలిసి పగిలిన ఇనుప పైపులకు మరమ్మత్తులను చేయించారు. ఈ సందర్భంగా కొత్తగేటు టిడిపి అధ్యక్షులు కోట్ల రాజు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు తమ ప్రాంతంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు తాగునీటి కుళాయి పైపులను తాము పర్యవేక్షించి పైపులు పగిలిన చోట్ల నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సొంత ఖర్చులతో వెల్డింగ్ మిషన్‌ను అద్దెకు తీసుకువచ్చి పైపులకు మరమ్మతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగేటు టిడిపి ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు తమ్మిశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : ఎంపి


సమస్యలు తెలుసుకుంటున్న ఎంపి శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం అని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గం 41వ డివిజన్ భవానీపురంలోని మసీద్ వీధి నుంచి ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు చిట్టాబత్తుని శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ (అన్న), రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్ కుమార్‌లతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏడాదిగా చేపట్టిన సంక్షేమ, అభివద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడలో 41వ డివిజన్ అన్ని బూత్‌లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ముందుగా పూర్తి చేసేందుకు కృషి చేసిన డివిజన్ అధ్యక్షుడు సంతోష్ కుమార్‌తో పాటు ఆ డివిజన్ టిడిపి నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఖాజా, సీనియర్ నాయకులు కరీముల్లా, డివిజన్ నాయకులు క్లస్టర్ ఇన్చార్జ్ యేదుపాటి రామయ్య, కో-క్లస్టర్ శివాజీ, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆశాలకు సంక్షేమ పథకాలన్నీ వర్తింపచేయాలి : కమల



మాట్లాడుతున్న కమల

ప్రజాశక్తి - గంపలగూడెం : జిల్లా వ్యాప్తంగా ఉన్న అందరి ఆశా వర్కర్లకు ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని జిల్లా ఆశా వర్కర్ల ప్రధాన కార్యదర్శి ఎ.కమల కోరారు. ఆశ వర్కర్ల ప్రతినిధి చంద్రకళ అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ, ఆశ వర్కర్లకు ఇచ్చే సంక్షేమ పథకాల్లో తల్లికి వందనం, వితంతు, ఒంటరి మహిళ పెన్షన్లను, ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో నిలిపివేయడం సరైంది కాదన్నారు. ఆశ వర్కర్లు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వారికి పీఎఫ్, ఇఎస్ఐ ,గ్రాట్యూటీ, పెన్షన్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని, పదివేలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నట్లు చెప్పారు. ఇచ్చే రూ.10 వేలల్లో వర్కర్లు ఆయా గ్రామాల నుండి గర్భవతులను ఆరోగ్య కేంద్రాలకు తరలించేందుకు సగం సగం డబ్బు వెచ్చించాల్సి వస్తుందన్నారు. ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సిన సందర్భంలో టిఎడిఎలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక జీవోలు వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. గంపలగూడెం ఆరోగ్య కేంద్రాల నూతన కమిటీ 12 మందితో ఏకగ్రీవమైంది. అధ్యక్షురాలుగా పి.చంద్రకళ, కార్యదర్శిగా పి.సుమలత, కోశాధికారిగా కె.శారద పాటు మంగమ్మ జీవిత, లక్ష్మీ, సుహాసిని, అరుణ, జ్యోతి, చరణ్య, సావిత్రి, తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమిటీ మరో పదిమందితో ఏకగ్రీవం కాగా, అధ్యక్షురాలుగా బి.లక్ష్మి కార్యదర్శిగా, జి.అరుణ కోశాధికారిగా కె.కృష్ణవేణితోపాటు ఎస్‌కె. జాన్ బి, రామలక్ష్మి, నాగమల్లేశ్వరి, కుసుమ, మరియమ్మ, ధనలక్ష్మి తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మహాసభకు మండల సిఐటియు కార్యదర్శి జానపాటి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా ఎరువులు సరఫరా చేయాలి


జెడికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో యూరియా, డిఎపి వంటి ఎరువులను ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వ సహకార సంఘాల ద్వారా రైతాంగానికి సరఫరా చేయించాలని, నానో ఎరువులను ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల వీరాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ పనులు సాగుతున్నాయన్నారు. వరిపంటలకు సీజన్లో డిఎపి వేయాలన్నారు. నారుమళ్ళు, నాట్లు వేస్తున్న సందర్భంలో యూరియా అవసరం ఉంటుంది. కానీ, ఈ రెండు ఎరువుల నల్ల బజారుకు చేరాయి. సహకార సంఘాలకు అరకొరగా సరఫరా ఉండటంతో రైతులు గత కొన్ని వారాలుగా ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్నారు. అనేక చోట్ల రైతాంగం అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. అయినా ఫలితం లేదు. వర్షాలు ఆలస్యమై రైతాంగం ఆందోళన చెందుతుందన్నారు. మరోపక్క గత ఏడాడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి ఎరువులు బ్లాక్ కొనాల్సిన దుస్థితిరావడం గోరుచుట్టుపై రోకటిపోటులా మారిందన్నారు. ఈ స్థితిలో మీరు ప్రత్యక్ష జోక్యం చేసుకుని జిల్లాకు అవసరమైన ఎరువులను సరఫరా చేసి, రైతాంగాన్ని ఆదుకోవాలని, బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై తగినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



రహదారులు జలమయం

ప్రజాశక్తి - మైలవరం : మైలవరంలో శుక్రవారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదాపురం, భవాని నగర్, రామకష్ణ కాలనీ, విజయవాడ బైపాస్ రహదారిపైకి మోకాళ్ళ లోతు వర్షపు నీరు చేరి ప్రవహించింది. మురుగు కాలువల నీరు కూడా రహదారుల పైకి చేరటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విజయవాడ బైపాస్ పెట్రోల్ బంకు వద్ద కొంతసేపు ట్రాఫిక్ నిలిచింది. మరోవైపు పత్తి, వరి నారు పోసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గం భవానీపురం 40వ డివిజన్‌లోని మైనంపాటి వారి వీధి, ఎంపీ దాస్ రోడ్డులో రూ.4 లక్షల వ్యయంతో నూతన మంచినీటి పైపులైన్ల ఏర్పాటు కోసం శంకుస్థాపన చేశారు. శుక్రవారం స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి తోపాటుకార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ జాస్మిన్, ఇమ్యునిటీ సెక్రటరీస్ అధికారులు, వైసీపీ నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ పర్యటన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : గుంటుపల్లి గ్రామంలో మైలవరం ఎంఎల్‌ఎ వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం పర్యటించారు. గుంటుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.05 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. గుంటుపల్లి గ్రామపంచాయతీకి అప్పటి రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ మంజూరు చేసిన రూ.6.40 లక్షల నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టరును ఎమ్మెల్యే ప్రారంభించారు. గుంటుపల్లి గ్రామంలో అంతిమయాత్ర కోసం దాత చెరుకూరి శంకర్రావు రూ.17 లక్షల విలువైన మహాప్రస్థానం వ్యాను అందజేయగా, ఆ వ్యానును ఉంచేందుకు అదే గ్రామానికి చెందిన మరో దాత చెరుకూరి వెంకటరాయుడు వితరణ రూ.17 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాన్ని పరిశీలించి దాతను అభినందించారు.



పశువులకు ఉచిత టీకాలు

ప్రజాశక్తి - తిరువూరు : పశుసంవర్ధకశాఖ వైద్యులు, సిబ్బంది శుక్రవారం తిరువూరు మండలంలోని చిట్టెల, ఆంజనేయ పురం గ్రామాల్లో పశువులకు ఉచిత టీకాలు చేశారు. లంఫీ స్కిన్ వ్యాధి ఆవులకు రాకుండా టీకా వేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి హనుమతురావు, తహశీల్దార్ ఉదయ్ భాస్కర్, ఆంజనేపురం సర్పంచ్ మామిడి కుటుంబరావు, పశువైద్యులు అభిలాష్, శ్వేతా, విఎల్ ఒఎం.గోపాలకృష్ణ, పాల్గొన్నారు.



మరుపిళ్ల చిట్టి వర్ధంతి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు నిస్వార్థ ప్రజానేత మరుపిళ్ల చిట్టి 54వ వర్ధంతి సందర్భంగా చిట్టి నగర్ కూడలి వద్ద ఉన్న వారి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు. కార్యక్రమంలో నగరకుల నాయకులు పోతిన వెంకట మహేష్, మరుపిల్ల వాసు, మజ్జి సత్యనారాయణ, పోతిన సాంబశివరావు, పోతిన సర్వేశ్, కామాంధుల నరసింహారావు, పొట్నూరి శ్రీనివాసరావు, బాయిన లక్ష్మణరావు, పొట్నూరి శివ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఒసి అందజేత

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : అర్హులైన బాధితులకు మంజూరైన ఎల్‌ఒసి పత్రాలను శుక్రవారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అందజేశారు. 46వ డివిజన్ సాయిరాం సెంటర్‌కు చెందిన బల్లా గౌతమికి పుట్టిన నవజాత శిశువుకి బరువు తక్కువగా ఉండటంతో మెరుగైన వైద్యఖర్చుల నిమిత్తం దరఖాస్తు చేసుకోగా రూ.19.53 లక్షల ఎల్‌ఒసి పత్రాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

అడుగడుగునా గోతులు.. ప్రయాణానికి ఇక్కట్లు

- అధ్వానంగా చల్లపల్లి-నడకుదురు రహదారి
- పెద్దపెద్ద గోతులతో వాహనదారుల ఇబ్బందులు



అడుగడుగునా గోతులు.. గోతుల నిండా నీళ్లు... కనీసం సైకిళ్లు, ద్విచక్ర వాహనం సైతం వెళ్లడానికి తీవ్ర ఇబ్బందికరంగా మారిన రహదారి. ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వం వలన చల్లపల్లి నడకుదురు ఆర్ అండ్ బి రోడ్డు పరిస్థితి దీనంగా మారింది.

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి నుండి నడకుదురు వెళ్లే రహదారి గోతులు మయంగా మారడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. అడుగడుగునా గోతులు ఏర్పడటంతో ప్రయాణం సాగటం లేదు. చల్లపల్లి నుండి మూడు కిలోమీటర్ల దూరం ఉన్న రహదారిలో కోమల థియేటర్, టీచర్స్ కాలనీ సమీపంలో పెద్ద గోతులు ఏర్పడటంతో వాహనాలన తరచూ ప్రమాదాన్ని గురవుతున్నాయి. ఈ దహదారి వెంట అవనిగడ్డ కరకట్ట ఆర్టిసి బస్సులు రోజుకు 56 ట్రిప్పులు నడుపుతున్నారు. టన్నుల కొద్ది బరువుతో టిప్పర్లు ఇసుక రవాణా ఈ రహదారి చేయటంతో రోడ్డు గోతులు పడి కంగి శిధిలమవుతున్నాయి. గత ప్రభుత్వం లో నిర్మాణం చేపట్టిన రోడ్డు సైతం అంచులు కోత కు గుర్రై రహదారి కుంచించుకుపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకోవడానికి భయపడుతున్నారు. ద్విచక్ర సైతం ద్విచక్ర వాహన సైతం తప్పుకోలేని పరిస్థితి అక్కడ నెలకొన్నది. రాత్రి వేళలో ఆ రహదారి ప్రయాణం నరకానికి మార్గంఅని ప్రయాణికు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం గుంతలు లేని రోడ్లు తయారు చేస్తామని చేసిన ప్రకటనలు నీటి మీద మూటలుగా మిగిలిపోయాయని ప్రజల విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తాత్కాలికంగా గోతులు పూడ్చి మరమ్మతులు చేసిన యధాప్రజా తథారాజగా రహదారులు మారడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఇంత జరుగుతున్న ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోకపోవడం పై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి నడకదు రు,చల్లపల్లి ప్రధాన రహదారి ని బాగు చేయించాలని కోరుతున్నారు



కోతకు గురైన ఆర్అండ్బి రహదారి

కోతకు గురవుతున్న రహదారులు

అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆర్ అండ్ బి రహదారులు కోత గురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. చల్లపల్లి నుండి శ్రీకాకుళం ఆర్ అండ్ బి రహదారిలో వెలివోలు సమీపంలో కోత కు గుర్రై సంవత్సర కాలమైన నేటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడంపై సంబంధం అధికారులపై ఆ ప్రాంత రైతులు మండిపడుతున్నారు. ఈ వ్యవసాయ సీజన్లో రహదారి పక్కనే పంట కాలువ ప్రవాహం ఎక్కువగా ఉండటం వలన రహదారి కోత పెరిగే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు కోతకు గురవుతూ కుంచించి పోతున్న రహదారికి మధుమతులు చేసి ప్రమాదాల నివారించాలని ఆ ప్రాంత ప్రజలు సంబంధిత కోరుతున్నారు.

28, 29 తేదీల్లో కూచిపూడిలో ప్రత్యేక పాస్‌పోర్టు శిబిరం

ప్రజాశక్తి-మొవ్వ : జిల్లాలోని నాట్య క్షేత్రమైన కూచిపూడిలో ఈనెల 28, 29 తారీకులలోప్రత్యేక పాస్పోర్ట్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఉయ్యూరు డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎస్ రాజేష్ పేర్కొన్నారు. ఆయన ఎంపీడీవో దయాల సుహాసినితో కలిసి శుక్రవారం కూచిపూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి కష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలతో నిర్వహిస్తున్న పాస్పోర్ట్ శిబిర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కషి చేయాలని సూచనలు ఇచ్చారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్యకళాపీఠంలో 28వ తారీకునప్రారంభించే ఈ నమోదు కార్యక్రమం లో భాగంగా సాయంత్రానికి హైదరాబాద్ కు చెందిన కళాకారులతో నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠం ఉప ప్రధాన చార్యులు కళా రత్న డాక్టర్ చింతా రవి బాలకష్ణ తో కార్యక్రమం గురించి చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.వి సోమేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఏ.ఆర్. ఫణీంద్ర, సర్పంచ్ భర్త కొండవీటి అమరబాలేశ్వరరావు, మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వీరంకి తులసీదాస్ పాల్గొన్నారు.

కృష్ణాపురం డ్రైనేజీలో గడ్డి తొలగింపు

ప్రజాశక్తి-కోడూరు : అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ సహకారంతో చొరవ తో అనాథరైజ్ డ్రైనేజీగా ఉన్న కృష్ణాపురం-నరసింహాపురం డ్రైనేజీలో నెలకొని ఉన్న క్కికిసకాడ, చెరుకుల గడ్డి తొలగింపు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రోక్లైని వద్ద ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీసీ చైర్మన్ మాట్లాడుతూ ఈ డ్రైనేజీ వెంట పంట సాగు చేస్తున్న రైతులు సమస్యను స్థానిక శాసనసభ్యులు మండల బుద్ధ ప్రసాద్ దృష్టికి తీసుకు వచ్చారని వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే రైతన్నలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో ముద్ధినేని శ్రీమన్నారాయణ, ఇంకొల్లు రాంబాబు, ఇంకొల్లు సత్యనారాయణ, పెదబాబు, విశాల్ బాబు, నాగళ్ళ సాంబశివరావు, పిల్లి గంగాధర్ రావు,తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న పీసీ చైర్మన్, స్థానిక రైతులు

హారికకు పరామర్శ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికను గన్నవరం జడ్పిటిసి సభ్యురాలు అన్నవరపు ఎలిజిబెత్ రాణి శుక్రవారం కొత్తూరులోని ఆమె నివాస గహంలో పరామర్శిం చారు. ఇటీవల గుడివాడలో ఆమెపై చేసిన దాడిలో భాగంగా ఆమెను పరామర్శించారు. బీసీ మహిళాపై ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం సిగ్గుచేటని జడ్పిటిసి అన్నారు. గన్నవరం వైస్ ఎంపీపీ సాతులూరి శివ నాగరాజ కుమారి, వైయస్సార్ గౌడ సంఘం జిల్లా నాయకులు మారీదు రాంబాబు ఇతర ప్రజా సంఘాల నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఉద్యోగులు


ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలో సిపిఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఆద్వర్యంలో శుక్రవారం కలక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ జె ఏ సి ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57కు లోబడి అర్హులైన ప్రతి ఒక్కరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ అమలులోకి రాకముందు కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్ల ద్వారా నియమించిన ఉద్యోగులకు పాత పెన్షన్ అవకాశం కల్పిస్తూ విడుదల చేసిన మెమో 57ను అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె ఏ,ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయకపోతే రానున్న రోజుల్లో మరో బిఆర్‌టిఎస్ రోడ్ ఉద్యమం చూస్తారని స్పష్టం చేశారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్లు కె. ఎల్.శ్రీనాథ్, తమ్ము నాగరాజు లు మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన మెమోకు 5 ఏళ్ళ కాలం పూర్తయినప్పటికీ దాన్ని రాష్ట్రంలో అమలుచేయడం లేదని, ఈ నెలలో దీనికి సరైన పరిష్కారం చూపకపోతే ఆగష్టు లో విజయవాడలో మహెూద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు డి. శ్రీనివాస్, ఏపీసిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సతీష్, సిఎం దాస్, డి పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్లు,ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్లు సతీష్, నయీమ్ జిల్లా కన్వీనర్లు మహిపాల్, జయరాజు, పలువురు ఉద్యోగ ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండలమ్మకు సారె సమర్పణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న ఆషాడ మాస మహెూత్సవములలో భాగంగా శ్రీ అమ్మవార్లకు సారే ను సమర్పించారు. మచిలీపట్నం బలరాముని పేట మూడు స్తంభాల సెంటర్ మహిళలు శుక్రవారం సారేను సమర్పించారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు, సిబ్బంది వారి ఆహ్వానించి దేవస్థానం ముఖ్య అర్చక స్వామి శివ సంతోష్ శర్మ అమ్మ వారికి పూజా కార్యక్రమం జరిపి అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కార్టూనిస్ట్ హరికృష్ణకు జాతీయ బహుమతి





ప్రజాశక్తి-ఉయ్యూరు : మండలంలోని కలవపాముల గ్రామానికి చెందిన ప్రముఖ కార్టూనిస్టు నాగేశ్వరావు హరికృష్ణకు జాతీయ స్థాయి పోటీల్లో రెండవ బహుమతి లభించింది. కార్టూన్ వాచ్ మాసపత్రిక ఆధ్వర్యంలో, చత్తీస్ఘడ్ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటు సహకారంతో "ధూమా పానము, మద్యపానము గొప్పతనం కాదు" అనే అంశంపై జాతీయ కార్టూన్ పోటీలో హరి కష్ణ గీసిన కార్టూన్కు రెండవ బహుమతి లభించింది. కార్టూన్ వాచ్ మాస పత్రిక సంపాదకులు శ్రీ త్రయంబక్ శర్మ చేతుల మీదుగా ఈ బహుమతిని ఆయన అందుకున్నారు.ఈ విజయాన్ని పురస్కరించుకుని హరికృష్ణ మాట్లాడుతూ పోటీ నిర్వాహకులకు, పోటీ న్యాయనిర్ణేతలకు కతజ్ఞతలు తెలిపారు. గతంలో హరికృష్ణ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అనేక బహుమతులు అందుకున్నారు. "హరికృష్ణ కార్టూన్స్" అనే పేరుతో కార్టూన్ల పుస్తకాన్ని వెలువరించారు. అంతేకాదు, సోషల్ మీడియా వేదికలపై ఉన్న ఫాలోయింగ్ ను గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు "సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్" అవార్డు కూడా ఇచ్చింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు : డిఆర్ఒ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : ప్రభుత్వ కార్యాలయలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సంబధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ హాల్ లో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే నిర్వహించి ఉద్యోగ సంఘాలు, పలువురు ఉద్యోగుల నుండి వినతి పత్రాలు స్వీకరించారు.అనంతరం డి ఆర్ ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దష్టి పెట్టామని, ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతినెల 3వ శుక్రవారం ఉద్యోగల సమస్యలను పరిష్కరించేందుకు ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సి పి ఎస్ ఉద్యోగులందరికీ 10 శాతం నుంచి 14 శాతంకి కాంట్రిబ్యూషన్ పెంచాలని ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో అర్జీ సమర్పించారు. అలాగే పార్ట్ టైం టీచర్ల పార్ట్ టైం టీచర్ల పని వేళల్లో స్పష్టత ఇవ్వాలని సమగ్ర శిక్ష పార్ట్ టైం టీచర్లు కోరారు.



వినతులు అందిస్తున్న ఉద్యోగులు



ప్రజలపై విద్యుత్ భారాలు ఆపాలి

ప్రజాశక్తి - మైలవరం : గత ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ విషయంలో మాట తప్పిందని మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు ప్రజలపై విద్యుత్ భారాలు ఆపాలి అనే డిమాండ్లతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లపై మండల వ్యాప్తంగా ప్రజలను చైతన్య పరుస్తూ స్మార్ట్ మీటర్లు తీసేయించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఆగస్టు 5న విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ధర్నా జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, రావూరి రమేష్, సంధి పాము ఇస్సాక్,వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.వి.రంగారెడ్డి

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ప్రదర్శనల బకాయిలు, పెన్షన్లు, గుర్తింపు కార్డులు సహా కళాకారుల సమస్యలు పరిష్కరించాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజానాట్యమండలి (పిఎన్ఎం) ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం శ్రీరాంపురం గ్రామంలో మండల కళాకారుల సమావేశం సీనియర్ కళాకారుడు వి.వెంకటరత్నం అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షుడు జి.వి.రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జనజాగృతే కళల పరమార్థమన్నారు. సమస్యల పరిష్కారం కోసం కళాకారులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి పంబి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాకారుల ఐక్యత కోసం పిఎన్ఎం పాటుబడుతుందన్నారు. తిరువూరు రూరల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు డి.ఏసుపాదం, ఎస్.వెంకటేశ్వర్లు, ఎ.కొండూరు మండల అధ్యక్షుడు చింతరాల విక్టర్, బుర్రకథ కళాకారుల సంక్షేమం సమాఖ్య నాయకులు ముత్తయ్య, భూషణం, సునీత, ఫాదర్ పౌల్ తదితరులు సందేశాలిచ్చారు. పిఎన్ఎం సహకారంతో ఇటీవల అధికార యంత్రాంగాన్ని కలిసి, చర్చించిన వివరాలను డి.రవికుమార్ సభికులకు తెలిపారు. ఎ.నాగేశ్వరరావు అధ్యక్షుడుగా, ఆర్.రామారావు కార్యదర్శిగా, ఇశ్రాయేల్, డేవిడ్, ప్రభాకర్, వెంకటరత్నం, బాషా సభ్యులుగా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. వివిధ గ్రామాల నుంచి ఆయా విభాగాల కళాకారులు హాజరయ్యారు. వెంకటరత్నం, ఎ.నాగేశ్వరరావు కళాకారులకు ఆత్మీయ ఆతిథ్యమిచ్చారు.

గ్రామీణ సంపద స్థాపన ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామీణ సంపద స్థాపన ప్రణాళిక 2025-26పై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఒ రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం పనులు ఏవిధంగా ఉన్నాయి. చెత్త సేకరణకు చెత్త సేకరణ బండ్లు అన్ని గ్రామాల్లో వస్తున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిలో తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా వేసుకోవాలని తెలిపారు. ఎపిఒ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, మునగా, మల్లితోటలు, గులాబి తోటల, ఆయిల్ ఫామ్ తదితర పంటలు పెంచుకునే రైతులను గురించి వారికి ఉచితంగా పండ్ల తోటలు పెంచుకోవడానికి ఎకరాకు పంటను బట్టి 2 లక్షల వరకు లబ్ధిదారులకు ఇచ్చినట్లు తెలిపారు. ఎపిఎం రామకృష్ణ మాట్లాడుతూ ఈ రోజు మండలస్థాయిలో జరిగే విపిఆర్‌పి శిక్షణలో పాల్గొన్న విఒఎలు, విఒ ప్రెసిడెంట్‌లు అనివిఒలలో గ్రూపు లీడర్‌లకు, అన్ని గ్రూపుల్లోని సభ్యులకు మీటింగ్‌లను 24వ తేదీలోగా ఏర్పాటు చేసుకొని విపిఆర్‌పిపై శిక్షణను పూర్తి చెయ్యాలన్నారు. ఎపిఎం బొలగాని రామకృష్ణ పాల్గొన్నారు.

పేట మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కొటారి



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కొఠారి సత్యనారాయణ ప్రసాద్‌ను జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా గతంలో ఎస్సీ మహిళకు ప్రభుత్వం రిజర్వేషన్ కేటాయించింది. ఈ రిజర్వేషన్ ఎస్‌సిలకు కాకుండా మరల ఒసికి కేటాయించడంపై నియోజకవర్గంలోని ఎస్‌సి నుండి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. మార్కెట్ యార్డ్ స్థాపించినప్పటి నుండి ఇంతవరకు ఎస్‌సిలకు రిజర్వేషన్ అవలేదని ఇప్పటికైనా జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ ఎస్సీ రిజర్వేషన్ కావడంతో నియోజకవర్గంలోని ఎస్సీలు ఆనందపడ్డారు. కానీ మరల ఈ రిజర్వేషన్ ఎస్సీలలో ఎస్సీ మహిళ చైర్మన్ అభ్యర్థులు ఆశావాహులు ఎక్కువగా ఉన్నారని నెపంతో నియోజకవర్గ అధినాయకులు రిజర్వేషన్ మార్చారని నియోజకవర్గానికి చెందిన ఎస్సీ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని ఎస్‌సి మహిళకే కేటాయించాలని కోరుతూ కలెక్టర్ లక్ష్మీశకు, ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు అంబేద్కర్ సేన జిల్లా ఉపాధ్యక్షులు కరిసే మధు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ దళితులకు అన్యాయం చేయొద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం జిల్లా జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ పదవి ఇప్పటివరకు దళితులకు దక్కకపోవడంతో ఎస్‌సి మహిళకి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడంతో ఎస్‌సి దళితులు సంతోషం వ్యక్తపరిచారు. సోషల్ మీడియాలో ఎస్సీ దళిత మహిళకు కాకుండా ఓసి కులానికి చెందిన కొఠారి ప్రసాద్‌కు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి ఇస్తున్నట్లు ప్రకటనలు వస్తుండటంతో ఎస్‌సిలకు న్యాయం చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత : ఎంఎల్‌ఎ గద్దె



సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ గద్దె

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటిని పరిష్కరించే ఏకైక ప్రభుత్వం తమదేనని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఆనాడు అన్న ఎన్టీఆర్ నుంచి నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరకు ఇదే విధానాన్ని తాము అవలంభిస్తున్నామని అన్నారు. శుక్రవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ లబ్బీపేట గ్రీన్‌ల్యాండ్స్ వెనుక 102వ పోలింగ్ బూత్ ఏరియాలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ప్రతి ఇంటికి వెళ్ళి ఏడాది కూటమి ప్రభుత్వ హాయంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో భాగంగా ఈ డివిజన్‌లో ఒక బాలుడి తల్లి బ్యాంకు ఖాతాలో రూ.15 వేలు కాకుండా తక్కువ నగదు అంటే రూ.10 వేలు మాత్రమే జమ అయినట్లుగా తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పూర్తిస్థాయిలో నగదు జమయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భాగం సాయి ప్రసాద్, కంచర్ల శ్రీను, కలాం, దున్నా ఏసురత్నం, సకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



జగ్గయ్యపేటలో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు



మైలవరంలో ఎరువుల వివరాలను అడుగుతున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట సబ్ డివిజను పరిధిలోని జగ్గయ్యపేట, వత్స వాయి, పెనుగంచి ప్రోలు మండలాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు దుకాణాలను వ్యవసాయ శాఖ, విజిలెన్స్ రాష్ట్ర స్థాయి స్క్వాడ్ బృందాలు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువులకు, పురుగుమందులు, విత్తనాలు సంబంధించి బిల్ బుక్స్, నిల్వ రిజిస్టర్, లైసెన్సులు తనిఖీ చేశారు. లైసెన్స్‌లో ఓ ఫారం కాలపరిమితి ముగిసిన కారణంగా రెన్యూవల్ చేసుకునే వరకు జగ్గయ్యపేటలో ఎరువులు 60.8 టన్నులు, 15.26 లక్షలు, వత్సవాయిలో 35.7 టన్నులు, 6.82 లక్షలు, పెనుగంచిప్రోలులో 11.3 టన్నులు రూ.1లక్ష విలువ గల స్టాక్ అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఏడిఏ భవానీ, స్క్వాడ్ బృందం ఎడిఎ హనుమంతరావు, విజిలెన్స్ డీఎస్పీ సోమేశ్వరరావు, జగ్గయ్యపేట మండల వ్యవసాయ అధికారి వరలక్ష్మి, వత్సవాయి ఏవో సత్య నారాయణ, పెనుగంచిప్రోలు ఏవో రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నందిగామ : నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి కె. బాలకష్ణ నందిగామ పట్టణంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రైతులకు అత్యవసరమైన ఎరువుల లభ్యత, ధరలు, నిల్వలపై సమగ్రంగా పరిశీలించారు. బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నందిగామ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, నందిగామ తహశీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

మైలవరం : మైలవరంలోని పలు ఎరువులు, పురుగు మందుల షాపులను శుక్రవారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. మందు కట్టలు అధిక ధరలకు అమ్ముతున్నారేమోనని రైతులను అడిగి వివరాలు తెలుసు కున్నారు. యూరియా కట్ట కావాలంటే నాన్ యూరియా అంట కడుతున్నారని దుకాణ దారులకు సూచించగా అలాంటిదేమీ లేదని, మందు కట్టలు కొరత లేదని ఏ మందులు కావాలంటే అవే రైతులకు ఇస్తున్నామని రైతు సంఘంనాయకుల దృష్టికి దుకాణాదారులు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ఆంజనేయులు, మండల అధ్యక్ష కార్యదర్శులు రావుల సుబ్బారావు, వజ్రాల వెంకటరెడ్డి, రైతు సంఘం మండల కమిటీ సభ్యులు సిహెచ్.సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : హైకోర్టు న్యాయమూర్తి కె.శ్రీనివాసరెడ్డిపై అభ్యర్థన కర చర్యలను, బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు వంశీమోహన్, భాగ్యశ్రీ, తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాది అయ్యప్పలపై దుండగుల దుశ్చర్యలను నిరసిస్తూ శుక్రవారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు.


నందిగామ : హైకోర్టు న్యాయమూర్తిపై అసభ్యకరమైన మెసేజ్ లు పెట్టటం, న్యాయవాదులపై జరుగుచున్న దాడులకు అవమానాలకు నిరసనగా శుక్రవారం నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు ఆధ్వర్యంలో కోర్టు విధులను న్యాయవాదులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించే న్యాయమూర్తిపై ఇటువంటి అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టడం చాలా బాధాకరమని అటువంటి వారి పట్ల చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - మైలవరం : వివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైలవరంలో బోటనీ సబ్జెక్టు (వృక్ష శాస్త్రం) బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సరళకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో ఎమ్మెస్సీ బోటనీ మాస్టర్ డిగ్రీ కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

విద్యుద్ఘాతానికి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలంలోని మల్లేలలో విద్యుత్ షాక్‌కు గురై గుంజా మారేశ్వరరావు (37) శుక్రవారం మృతిచెందారు. ఇంటి ఆవరణలోని విద్యుత్ మోటారు పనిచేయకపోవడంతో వైర్లు పరిశీలిస్తుండగా కరెంటు సరఫరా కాగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేశ్వరరావు కూలిపనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వెంకటేశ్వరరావు మృతితో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. వెంకటేశ్వరరావు మతదేహాన్ని తిరువూరు ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పాఠశాల అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని కాకానినగర్‌లో గల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల (మోడల్ స్కూల్) అభివృద్ధికి రూ.5 వేల విరాళాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు శుక్రవారం పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శివలతకు అందజేశారు. ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ డాక్టర్ లక్ష్మీ శ, చైర్మన్ డాక్టర్ జి.సమరం పిలుపుమేరకు పాఠశాల అభివృద్ధికి పి ఫోర్‌లో భాగంగా ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఇన్చార్జ్ హెచ్ఎం శివలత మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనం కోసం విరాళాన్ని అందజేసిన కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.శ్రీదేవి, మెర్సి, బాలబాలికలు పాల్గొన్నారు.

శివాపురంలో వీధికుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి వత్సవాయి : ఓ బాలుడిని వీధి కుక్కలు మీద పడి కరిచిన సంఘటన మండలంలోని శివాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి, వీధి కుక్కల దాడిలో కొంక కేతన్ సాయి, కొంక వేణు అను బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. గత రెండు రోజులుగా గ్రామంలో అనేకమంది కుక్కల దాడిలో గాయపడినట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

సొసైటీ భూముల్లో బుసక అక్రమ రవాణా

- రాత్రివేళల్లో వందల లారీల్లో తరలింపు
- గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం
- భూములను కాపాడాలని సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : ఎస్సీ సొసైటీ భూములలో అక్రమార్కులు రాత్రుళ్ళు ఇసుక, బుసక దోచుకుపోతున్నా రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడంలేదని రొయ్యూరు సొసైటీ సభ్యులు మీడియా ముందు వాపోయారు. శుక్రవారం మీడియాను వెంటపెట్టుకొని తమ సొసైటీ భూములలోకి తీసుకువెళ్లి పరిస్థితిని వివరించారు. తమ ఎస్సీ సొసైటీ భూములలో ఉన్న బుసక, మరోపక్క ఉన్న ఇసుకను రాత్రుళ్ళు రెండు పెద్ద పెద్ద మిషన్ల ద్వారా వందలాది లారీలలో లోడింగ్ చేసి తరలించకపోతున్నారని తెలిపారు. తమ సొసైటీ భూములలో మీకు ఎవరు పర్మిషన్ ఇచ్చారని అడగగా తమకు అన్ని పర్మిషన్లు ఉన్నాయని చెప్పి దబాస్తున్నారని సొసైటీ సభ్యుడు బందెల కోటేశ్వరరావు అన్నారు. గతంలో కూడా ఇలాగే ఈ అక్రమ తవ్వకం దారుడు తమ సొసైటీ భూములలోని బుసక,ఇసుక తరలించుకు పోయాడని అన్నాడు. రెవెన్యూ,పోలీస్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఆ తవ్వకాలను నిలుపుదల చేయడం లేదని వాపోయాడు. ఓ పక్క గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం జూన్ 1వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు కష్ణా నదిలో ఎటువంటి ఇసుక బసక తవ్వకాలు జరపరాదని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అధికారుల ఆదేశాలకు వ్యతిరేకంగా ఎవరైనా అక్రమంగా తవ్వకాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మైక్ ప్రచారం చేసి గ్రామ గ్రామాన తెలిపారు. అందుకు విరోధంగా రొయ్యూరు ఎస్సీ సొసైటీ భూములలో ఇసుక, బసకను వందలాది లారీలలో అక్రమార్కులు తరలించుకు పోతుంటే ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదని సంఘ సభ్యులు వాపోతున్నారు. పెద్ద పెద్ద మిషన్లతో చీకటి పడగానే వందల లారీలలో ఇసుక, బుసక లోడింగ్ చేసి తరలించుకుపోతారు, తెల్లవారేసరికి మిషన్లను పొదలమాటున దాచేస్తారు.



బుసక అక్రమ రవాణా చూపిస్తున్న దృశ్యం



బుసక తోడే ప్రొక్లెయిన్‌లను చూపిస్తున్న దృశ్యం



కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-కంకిపాడు : నిబంధనలకు విరుద్ధంగా కాలేజీ నిర్వహిస్తున్న శ్రీ సాయి జూనియర్ అన్ అకాడమీ పై చర్యలు తీసుకో వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వెంకటేశ్వరరావు కోరారు. కంకిపాడులోని కళాశాలల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ సాయి జూనియర్ కాలేజీ యాజమాన్యం విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తూ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కళాశాలపై చర్యలు తీసుకొని దాని గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కష్ణాజిల్లా కార్యదర్శి సమరం, ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి హారిక, విజయవాడ సెంట్రల్ కార్యదర్శి కుమార్ స్వామి జిల్లా కమిటీ సభ్యురాలు ప్రణీత మాధవ్, షణ్ముఖ, హాసిని తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : గిరిజన కుటుంబాలు తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారికి విద్యను అందించాలని జనసేన పార్టీ నాయకులు మాదివాడ రాము పేర్కొన్నారు. మచిలీపట్నం జిపిఅర్ ధర్మశాల ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాపట్నం ఎస్టీ కాలనీలో 300 పేద కుటుంబాలకు చెందిన పురుషులకు, మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు గొరిపర్తి శ్రీధర్, నూరి(ఖాన్) దివంగత బాజీ కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించగా. ముఖ్య అతిథులుగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, జనసేన పార్టీ నాయకులు మాదివాడ రాము తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నడకుదుటి అర్జున, కుంభం రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టి సంఘ నాయకులు కంభం రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేయండి

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ నిషేధంపై గ్రామాల్లో విస్తత స్థాయి ప్రచార నిర్వహించాలని మండల పరిషత్ అభివద్ధి అధికారి జి ఎస్ వి శేషగిరిరావు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ స్థానంలో క్లాత్ బాగ్స్, గాజు గ్లాసులు, మెటల్ పాత్రలు తదితరాలను వినియోగిం చేలాగా అవగాహన కల్పిం చాలని ప్రతి పాఠశాలలోనూ, అంగన్వాడి కేంద్రాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఈ మేరకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి కోటేశ్వరావు పలు గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో ఈనెల 19వ తేదీ శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశి కళ తెలిపారు. ఈ కార్యక్ర మాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ఈ విద్యా సంవత్సరానికి పీజీ 2వ సంవత్సరం (3వ సెమిస్టర్)లో లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టరేట్ డైరెక్టర్ డా ఎల్ సుశీల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ ఈ పి)మార్గదర్శకాల ప్రకారం, యూజి (4 సంవత్సరాల ఆనర్స్ డిగ్రీ) కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థుల నుండి పీజీ 2వ సంవత్సరం (3వ సెమిస్టర్)లో లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ ప్రవేశాలు 2025-26 విద్యా సంవత్సరం నుండి అమలులోకి రానున్నాయని, పిజి ఆనర్స్ డిగ్రీని విజయవంతంగా పూర్తిచేసిన అభ్యర్థులు, తగిన అర్హతలు కలిగి ఉంటే, సంబంధిత పీజీ కోర్సుల్లో రెండవ సంవత్సరం (3వ సెమిస్టర్) నుండి నేరుగా చేరేందుకు అర్హులన్నారు. నిబంధనల ప్రకారం అభ్యర్థులు తప్పనిసరిగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రకారం నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, దరఖాస్తులు జూలై, 25 .2025 లోగా కష్ణా యూనివర్సిటీ అడ్మిషన్ల డైరెక్టరేట్‌కు అందజేయాలని తెలిపారు.

భూములను వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగించొద్దు

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని తొమ్మిది గ్రామాల్లో వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్నామని తహసీల్దార్ జె విమల కుమారి అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదనలను అమలులో ఉంచినందున, కష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచనల మేరకు మండలంలోని పెద్ద అవుటపల్లి, పొట్టిపాడు, ఆత్కూరు, తేలప్రోలు, వేంపాడు, తరిగొప్పల, వెల్దిపాడు, వెన్నూతల, మానికొండ గ్రామాల నుండి ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదనలు ఉన్నందున ఈ భూములను ఏ విధమైన వ్యవసాయేతర అవసరాలకు వినియోగించకూడదని అన్నారు.

శాకంబరీదేవిగా అలంకారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శాకంబరీ దేవి అలంకారంతో శుక్రవారం దర్శనమిచ్చారు. గ్రామంలో ప్రసిద్ధి గాంచిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి వివిధ రకాల కాయకూరలు, పండ్లు లతో శాకాంబరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.**ప్రజాశక్తి - గుడివాడ :** పట్టణంలోని పలు దేవాలయాల్లో అత్యంత వైభవంగా శాకంబరీ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం, గౌరీశంకరపురంలోని శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానం(చిన్న శివాలయం), నీలామహల్ రోడ్డులోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవాలయాల్లో శ్రీ శాకంబరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ శాకంబరీ దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారికి తెల్లవారుజాము నుండి వేద పండితులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి ఆషాఢ సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ఆలయాల్లో శ్రీ శాకంబరీ దేవి ఉత్సవాలు ఘనంగా జరిగాయని దేవాదాయ శాఖ ఈవో కందుల గోపాలరావు తెలిపారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు : తడి చెత్తను పొడి చెత్తను వేరువేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని తద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి అవకాశం ఉంటుందని ఈవోపీఆర్డి దిలీప్ కుమార్ అన్నారు. మండలంలోని ఆత్కూరు గ్రామంలో తడి చెత్త పొడి చెత్త వేరు చేయుట గురించి ప్రజలను చైతన్య పరిచే విధంగా ఇంటింటికి వెళ్లి వారితో మాట్లాడి తడి చెత్తని పొడి చెత్తను వేరువేరుగా ఉంచి కార్మికులకు అందించడం ద్వారా ఎరువును ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు.



చెరువులను తలపిస్తున్న రహదారులు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : ప్రజలకు సేవలు అందించడంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ అధికారులు కొత్త రికార్డులు సష్టిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమై కొద్దిపాటి వర్షానికి బందరు రోడ్లు చెరువులను తలప ి స్తున్నాయి. ప్రజలకు అసౌకర్యం కలగకుండా కోనేరు సెంటర్ నుంచి పోర్టు రోడ్డు వెళ్లే దారిలో ఆంధ్రాబ్యాంక్ దాటిన తర్వాత రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీటిని శుక్రవారం మధ్యాహ్నం నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది నలుగురు కలిసి బకెట్లతో ఎత్తిపోస్తూ వాన నీటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు . ప్రజలకు సేవ చేయడంలో నగరపాలక సంస్థ అధికారులకు ఉన్న చిత్తశుద్ధి పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఉన్న వర్షం నీటిని బకెట్లతో తోడించేంత పెద్ద తీసుకున్న అధికారులు డ్రైనేజీల్లో పూడిక తీయించి మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగు పరచాలని మచిలీపట్నం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నీటిని తోడుతున్న కార్మికులు

సాగునీటి ఇబ్బందులు తొలగిస్తాం : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజవర్గంలో రైతుల సాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో శుక్రవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గ్రామానికి వచ్చిన సందర్భంగా వెంకట్రావు మాట్లాడారు. గన్నవరం నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగునీటి కొరత ఏర్పడిందని, దీని నివారణకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కాలువ కింది గ్రామాల్లో సాగునీటి కొరతను తీర్చేందుకు ఏలూరు కాల్వకు గరిష్టంగా నీటిని విడుదల చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్ర టిడిపి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, గూడవల్లి నరసింహారావు, ఆళ్ల వెంకట గోపాలకష్ణ రావు, బొప్పన హరికష్ణ, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు తులసి మోహన్ పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రముఖుల తాకిడి కొనసాగింది. శుక్రవారం కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గగుడి ఇఒ శీనా నాయక్, వేద పండితులు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎంపీ శివనాథ్‌కి సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆశీర్వచనమండపంలో పండితులు వేద స్వస్తి అందజేయగా, ఈవో అమ్మవారి చిత్రపటం శేష వస్త్రం బహూకరించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కుక్కల స్వైర విహారంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేటలో అధికారుల నిర్లక్ష్యం వల్ల వీధి కుక్కల స్వైర విహారం చేసి గ్రామస్తులపై దాడి చేయడం వల్ల సుమారు 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముందస్తు చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతి పత్రం అందజేశారు. అయినా అధికారుల నిర్లక్ష్య ధోరణి వలన చర్యలు చేపట్టకపోవడంతో వీధికుక్కలు స్వైర విహారం చేసి కనబడిన వారిపై విచక్షణా రహితంగా దాడి చేయడం వల్ల తీవ్ర గాయాల పాలై చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. సిపిఎం ఇచ్చిన వినతి పత్రానికి స్పందించి చర్యలు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యం వలన ఇలాంటి సంఘటన జరిగిందని నాగరాజు మండిపడ్డారు. ఇప్పటికైనా నివారణ చర్యలు చేపట్టకపోతే తీవ్ర ఆందోళన చేస్తామని నాగరాజు హెచ్చరించారు. ఈ విషయంలో అధికారులు పూర్తి వైఫల్యం చెందారని ఆయన అన్నారు. ఏది ఏమైనా అమాయక ప్రజలు బలవుతున్నారని వారి పట్ల అశ్రద్ధ వహించవద్దని వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షాన సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలు ముందు పెద్ద ఎత్తున సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఆయన అధికారులను హెచ్చరించారు.

బెంట్లీ సిస్టమ్‌తో డిజిటల్ శక్తి వేగవంతం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మౌలిక సదుపాయాల ఇంజనీరింగ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అయిన బెంట్లీ సిస్టమ్స్ ఇన్కార్పొరేటెడ్ తమ ఇన్నోవేషన్ డే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిందని నిర్వాహకులు పి.ఈశ్వర్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమం, ప్రభుత్వ సంస్థలు, ఇంజినీరింగ్ సంస్థలు, మౌలిక సదుపాయాల కన్సల్టెన్సీల నుండి సీనియర్ నాయకులను ఒకచోట చేర్చడంతో పాటు డిజిటల్ ట్విన్స్, ఓపెన్, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ డెలివరీ వంటి వాటిపై చర్చించినట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలను రూపొందించే, నిర్మించే, నిర్వహించే విధానాన్ని ఎలా మారుస్తున్నాయో అన్వేషించే అవకాశం కల్పించిందని తెలిపారు. రవాణా, నీటి మౌలిక సదుపాయాలలో బెంట్లీ యొక్క పరిశ్రమ ప్రముఖ సామర్థ్యాలపై ఈ కార్యక్రమం దృష్టి సారించిందని తెలిపారు. వాస్తవ సమయంలో నిర్ణయం తీసుకోవడం, కార్యాచరణ స్థిరత్వం, దీర్ఘకాలిక సస్టైనబిలిటీని ఎలా అనుమతిస్తుందనేది డిజిటల్ ట్విన్ టెక్నాలజీ చూపించిందని తెలిపారు. ఆటోమేషన్, ఎఐ ఇంటిగ్రేషన్, జియోస్పేషియల్ ఇంటెలిజెన్స్, సహకార డిజిటల్ వర్క్‌ఫ్లోల ద్వారా మౌలిక సదుపాయాల వాటాదారులు తమ డిజిటల్ పరిపక్వతను వేగవంతం చేయడంలో సహాయపడటానికి బెంట్లీ నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించిందని అన్నారు.

క్వాంటం కంప్యూటింగ్‌తో విప్లవాత్మకమైన మార్పులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : క్వాంటం కంప్యూటింగ్ వల్ల సంక్లిష్ట గణనాలు, డేటా అనలిసిస్, సైబర్ సెక్యూరిటీ, ఔషధ పరిశోధన, ఆప్టిమైజేషన్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు సంభవించనున్నాయని ప్రముఖ విద్యావేత్త, క్వాంటం కంప్యూటింగ్ పరిశోధకులు జె.సుబ్రహ్మణ్యం అన్నారు. కె.బి.ఎన్. కళాశాల ఐక్యుఎసి విభాగం ఆధ్వర్యంలో క్వాంటం కంప్యూటింగ్ అంశంపై అధ్యాపకులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రధాన వక్తగా పాల్గొన్న సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంప్రదాయ కంప్యూటింగ్‌కు భిన్నమైన క్వాంటం భౌతికశాస్త్ర సూత్రాలపై ఆధారపడిన ప్రోత్సాహకరమైన కొత్త సాంకేతికతగా క్వాంటం కంప్యూటింగ్‌ను అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా గూగుల్, ఐబిఎం, మైక్రోసాఫ్ట్, డీ-వేవ్ వంటి సంస్థలు ఈ రంగంలో లోతైన పరిశోధనలు నిర్వహిస్తున్నాయని, భారత్‌లోనూ ఐఐఎస్‌సి, ఐఐటిలు, ఇతర విశ్వవిద్యాలయాలు ఈ పరిశోధనల్లో భాగంగా పనిచేస్తున్నాయని చెప్పారు. క్లాసికల్ కంప్యూటర్లతో సాధ్యం కాని సంక్లిష్ట సమస్యలను క్వాంటం కంప్యూటింగ్ ద్వారా వేగంగా పరిష్కరించడం సాధ్యమవుతుందన్నారు. డిగ్రీ స్థాయిలో కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, ఎలక్ట్రానిక్స్ అధ్యయనంలో ఉన్నవారికి క్వాంటం కంప్యూటింగ్ సవాల్‌తో కూడిన ఆసక్తికరమైన పరిశోధనాంశంగా ఉంటుందన్నారు.



అవగాహన కల్పిస్తున్న విద్యావేత్త సుబ్రహ్మణ్యం

ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో క్వాంటం కంప్యూటింగ్ అనుసంధానం కొత్త మార్గాలను సృష్టిస్తోందన్నారు. హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్ మీద అవగాహన కలిగి ఉన్న విద్యార్థులకు భవిష్యత్తులో రీసెర్చ్, టెక్నాలజీ రంగాలలో విశేష అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఐక్యుఎసి కో ఆర్డినేటర్ షమీమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో రీసెంట్ ఇన్నోవేషన్‌పై అంతర్జాతీయ సదస్సు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పి.బి.సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో 'రీసెంట్ ఇన్నోవేషన్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ బాబు తెలిపారు. మొగల్రాజపురంలోని కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ శుక్రవారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ రంగంలో ఎప్పటికపుడు కొత్త విధానాలు వస్తున్నాయని, ముఖ్యంగా అంతర్జాతీయంగా వస్తున్న మార్పుల గురించి చర్చించి యువతకు తెలియచేసేందుకుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సెమినార్‌లో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు, పరిశోధకులు, నిపుణులు పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ డేటా సెంటర్ డెలివరీ ఆఫీసర్ అండ్ పై డేటా సెంటర్ ఉపాధ్యక్షులు అభినవ్ కోటగిరి పాల్గొంటారని అన్నారు. ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఆచార్యుడు నీరజ్ ఉపాధ్యాయ, ఐ బి ఎం బెంగుళూరు నుండి శేష రఘునాథ్, జర్మనీ నుండి వి.శివ కిషోర్, అమెరికా నుండి వేణు నిమ్మగడ్డ, కిరణ్ బాబు మాచ, సురేష్ సిగ్గుల పాల్గొంటారని అన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ టి. ఎస్.రవి కిరణ్, కళాశాల డీన్ రాజేష్ జంపాల, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, సెమినార్ కో కన్వీనర్ జి. సామ్రాట్ కృష్ణ, కె.సుధీర్, కావూరి శ్రీధర్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థకు అత్యాధునిక వైద్య పరికరాలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఇండియన్ ఆయిల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్)లో భాగంగా తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థకు అత్యాధునిక వైద్య పరికరాలు అందించినట్లు సంస్థ మార్కెటింగ్ డైరెక్టర్ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 3 టెస్లా ఎంఆర్ఐ స్కానర్ (14 కోట్లు), 4డి సీటీ సిమ్యులేషన్ సిస్టమ్ (8 కోట్లు). తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడిచే ఈ వైద్య విద్యాసంస్థలో ఆరోగ్య సేవల సామర్థ్యం మరింత మెరుగుపడనుందని తెలిపారు. ఈ అధునాతన పరికరాల ద్వారా ప్రతి ఏటా 2.5 లక్షల మందికి పైగా రోగులు ప్రయోజనం పొందనున్నారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అత్యాధు నిక వైద్య నిర్ధారణ, చికిత్స ప్రణాళిక సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

క్షయవ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : టిబి వ్యాధి లక్షణాలు తెలుపుతూ ఈ వ్యాధి పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని గత రెండు నెలలుగా రాష్ట్రమంతా జరుగుతున్న ఇంటెన్సిఫైడ్ టీబీ కాంపెయినింగ్‌లో భాగంగా శుక్రవారం టీబీ యూనిట్ ఇబ్రహీంపట్నం ఆధ్వర్యంలో స్థానిక ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ గొల్లపూడి పార్టీ కార్యాలయంలో పాల్గొన్నారు. టీబీ యూనిట్ ఇబ్రహీంపట్నం పరిది లో వున్న టీబీ కేసెస్ గురించి, వ్యాధి గ్రామస్తులకు ఇస్తున్న చికిత్స గురించి తెలుసుకొని తరువాత టీబీ లక్షణాలు గురించి తెలుపుతూ భయపడవలసిన అవసరం లేదన్నారు. లక్షణాలున్న వారు తెమడ పరీక్షలు, ఇతర పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ అయితే ఇంటి వద్దే ఏఎన్ఎమ్‌లు, ఆశాలు ఆరు నెలలు వరకు మందులిస్తారని తెలిపారు. వ్యాధి సోకిన వారితో పాటు ఇంట్లో వున్న వారికి టీబీ శోక కుండా మందులు ఇస్తారన్నారు. టీబీ యూనిట్ ఇబ్రహీంపట్నం సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



తిరువూరులో వంటావార్పుతో నిరసన తెలుపుతున్నకార్మికులు

ప్రజాశక్తి - తిరువూరు : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె 6వ రోజు కూడా శుక్రవారం తిరువూరులో కొనసాగింది. పారిశుధ్య కార్మికులు కూడా సమ్మెలోకి రావటం నగర పంచాయతీ కార్యాలయం ప్రాంతం కార్మికులు చేసిన సమస్యల పరిష్కారం నినాదాలతో దద్దరిల్లింది. ఈ సందర్భంగా కార్మికులు వంటా వార్పు చేసి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం లో సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వ రావు, యూనియన్ నాయకులు సురేష్, నాగరాజు, మోహన్ రావు, బాజీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరావు అన్నారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు జీతాలు పెంచాలని 3 రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమానికి శుక్రవారం సిఐటియు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా, సిఐటియు నాయకులు కోట కృష్ణ, శేషు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎలకమ్మ పాల్గొన్నారు. చిల్లకల్లు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న 15 మంది కార్మికులకు ఏడు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిల్లకల్లు పంచాయతీ కార్మికులు 3 రోజులుగా చేస్తున్న సమ్మెకు ఎం.సోమేశ్వరరావు, సిఐటియు జగ్గయ్యపేట మండల కార్యదర్శి షేక్‌గౌస్ మియా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తాళ్లూరి నాగలక్ష్మి, బత్తుల లక్ష్మి, బత్తుల నర్సమ్మ, ఆశావర్కర్ల యూనియన్ నాయకులు కె.అరుణకుమారి, పి.వరలక్ష్మీ పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంచాలని న్యాయబద్ధంగా చేస్తూన్న 6వ సమ్మె కొండపల్లి మున్సిపాలిటీ మచ్చుర్ పాయింట్ షెడ్డు వద్ద నిరసన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు మేస్త్రి ఎం.వాసు, వర్కర్స్ శ్రీను, అప్పలరాజు, డోమినిక్ రాజు, శివరామకృష్ణ, నోజు, తిరపతిరావు, విజయకుమార్, రవి పాల్గొన్నారు. **నందిగామ** : నందిగామలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నందిగామ నియోజకవర్గం ఇన్ చార్జ్ వజ్రయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో కార్మికుల సమ్మె



ఇబ్రహీంపట్నంలో



నందిగామలో సమ్మెకు కాంగ్రెస్ మద్దతు